సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసరావు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): వార్డు మహిళా పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాసరావు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వార్డుల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే తెలియజేయాలన్నారు. మహిళా ఎస్‌ఐ ప్రమిల పాల్గొన్నారు.

దుస్తుల వితరణ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు కమిటీ డైరెక్టర్ సూర్యనారాయణ సంక్రాంతి పురస్కరించుకుని వాచ్‌మన్ కుటుంబానికి నూతన వస్త్రాలు వితరణ చేశారు. ఇటీవల ఆయన వైశాఖి స్పోర్ట్స్ పార్కు వాచ్‌మన్‌కు కూడా నూతన వస్త్రాలను అందించారు. పేద కుటుంబాలకు సందర్భానుసారంగా సాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణాలకు రక్షణ



వాహనచోదకులకు వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): వాహనచోదకులు ప్రయాణ సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు కోరారు. సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఏడీ, బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, ఎన్‌ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో వీడియోలు ప్రదర్శించి.. వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ జి.వాసుదేవరావు, సిబ్బంది చిట్టినాయుడు, మోహనరావు పాల్గొన్నారు.

21న అప్పన్న తెప్పోత్సవం



వరాహ పుష్కరిణి వద్ద సిద్ధం చేస్తున్న తెప్ప

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈ నెల 21న జరగనుంది. ఆ రోజు సాయంత్రం కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకావిహారంతో కనువిందు చేయనున్నాడు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారు విహరించే తెప్పని వరాహ పుష్కరిణి వద్ద ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవానికి వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మంగళవారం పరిశీలించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

అడ్డంగా వాహనాలు.. అవస్థలతో రాకపోకలు

- రోడ్ల పక్కనే వాహనాల నిలిపివేత
- ట్రాఫిక్‌కు అంతరాయం



జ్ఞానాపురం రహదారిలో మరమ్మతుల కోసం ఇలా ఫుట్‌పాత్‌లపై..



తాటిచెట్లపాలెం కూడలి రహదారిలో నిలిపి ఉన్న వాహనాలు

కంచరపాలెం: ప్రధాన, అంతర్గత రహదారులపై లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ఇతర వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. 5వ పోలీస్ స్టేషన్ పరిధి తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం వరకు, మర్రిపాలెం నుంచి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌కు, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతున్నారు. రెండేసి వరసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. నెలల తరబడి ఇదే పరిస్థితి ఉండటంతో చెత్త, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. దీంతో శానిటరీ సిబ్బంది చెత్తను తరలించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు రోడ్లపై కూడా వాహనాలు నిలిపివేయడం కారణంగా పలు చోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాలు, టిప్పర్ల రాకపోకలకు అడ్డు లేకుండా పోతుంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా.. పోలీసులు మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి.. నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణం నరకం

కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం మీదుగా నగరానికి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నాం. నిత్యం భారీ వాహనాలు రహదారికి ఇరువైపులా నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.


– ఈశ్వరరావు, ఐటీఐ జంక్షన్

వాహనాలు తరలించాలి

రహదారికి ఇరువైపులా ఏళ్ల తరబడి నిలిపిన వాహనాలను తరలిస్తే అటుగా ప్రయాణం చేసే వాహనాలకు ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి అలాంటి వాహనాలను తరలించాలి.

– రాంబాబు, ధర్మానగర్ కంచరపాలెం

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రజా మరుగుదొడ్లు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఇప్పటి వరకు ప్రారంభించలేదు. దీంతో వాటర్ ట్యాంక్ పాడైపోయింది. రేకులు తుప్పు పడుతున్నాయి. పది మందికి ఉపయోగపడాల్సిన మరుగుదొడ్లు దిష్టిబొమ్మల్లా మిగిలిపోయా యి. వెంటనే మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

14 వార్డులో...

జీవీఎంసీ 14వ వార్డులోని నక్కవానిపాలెంలోని మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. 2002లో ఎ.ఎం.జి.రోడ్డులో అప్పటి కార్పొరేటర్ పెందుర్తి పుష్పాంజలి వీటిని ప్రారంభించారు. కొద్ది కాలం పాటు ప్రజలు వీటిని వినియోగించారు. గత కొద్ది కాలం నుంచి మరుగుదొడ్లకు తాళం వేసి ఉంది. ఇక్కడ ఏర్పాటు చేసిన బోర్డులో మాత్రం ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉపయోగించవచ్చని కనిపిస్తోంది. జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకుని ప్రతి రోజూ మరుగుదొడ్లు తెరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వేడుకగా వెంకన్న సంక్రాంతి పరస



భజన చెట్టును ప్రారంభిస్తున్న ఈతలపాక సుజాత

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తిక్కవానిపాలెం వెంకన్న ఆలయం వద్ద గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి పరస ఘనంగా జరిగింది. కలియుగ వెంకన్నకు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళ నాయకురాలు ఈతలపాక సుజాత భజనచెట్టును ప్రారంభించి పూజలు చేశారు. తీర్థ మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సీతంపేటలో డెంగ్యూ ఫీవర్ సర్వే



నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో 7 ఏళ్ల అమ్మాయి డెంగ్యూ జ్వరం బారిన పడింది. దీంతో జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తపై మంగళవారం వ్యాధిగ్రస్తురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యాధికి గురైన బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితురాలి ఇంటి చుట్టు పక్కల ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా? డెంగ్యూ కారక దోమలు ఎక్కడైనా పెరుగుతున్నాయా అని నీటి నిల్వలు తనిఖీ చేశారు. నీటిలో దోమ లార్వాలు గుర్తించి.. నీటిని పారబోశారు. దోమలు వృద్ధి చెందకుండా, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస రెడ్డి, హెల్త్ సెక్రటరీ అప్పలనరస, వలంటీర్లు, యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం దుకాణాల కిటకిట



నక్కవానిపాలెం మటన్‌షాపు వద్ద జనాలు



నాటు కోళ్లు కొనుగోలులో బిజీబిజీ

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ముక్కనుమ పండగా సందర్భంగా సీతమ్మధార, నక్కవానిపాలెంలోని చికెన్, మటన్ షాపులు కిటకిటలాడాయి. సంక్రాంతి ఆదివారం, సోమవారం కనుమ కావడంతో కావడంతో చాలా మంది నాన్‌వెజ్‌కు దూరంగా ఉన్నారు. మంగళవారం ముక్కనుమ కావడంతో ఉదయం నుంచి మటన్, చికెన్, నాటు కోళ్ల దుకాణాలు కొనుగోళ్లదారులతో సందడిగా మారాయి.

సుందరం.. ఆహ్లాదం..



కొబ్బరి మొక్కలకు జాతీయ జెండా రంగులు

- తహసీల్దార్ కార్యాలయం రూపురేఖలు మారిపోయాయ్..



సుందరంగా అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

సీతమ్మధార(విశాఖ ఉత్తర): అర్బన్ తహసీల్దార్ కార్యాలయ రూపురేఖలు మారిపోయాయి. కార్యాలయ ఆవరణ మొక్కలతో నిండి ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఈర్ల శ్యామ్‌ప్రసాద్ ప్రజలు, సిబ్బంది సహకారంతో కార్యాలయాన్ని సుందరంగా మార్చారు. వీఆర్వోలు విధులు నిర్వహించేందుకు ఓ గది, రికార్డులు భద్రపరిచేందుకు మరో గదిని ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం కేటాయించారు. కార్యాలయ ఆవరణలో పువ్వుల మొక్కలు నాటించారు. కొబ్బరి చెట్లకు జాతీయ జెండా రంగులు వేయించారు. చెత్తను సిబ్బందితో తొలగించి ఆవరణాన్ని పరిశుభ్రంగా మార్చారు.



తహసీల్దార్ కార్యాలయంలో నాటిన మొక్కలు



వీఆర్వోల కోసం ఏర్పాటు చేసిన గది

మొత్తం కార్యాలయానికి రంగులు వేసి కొత్తదనం తీసుకొచ్చారు. ప్రతి సోమవారం స్పందనకు వచ్చే ప్రజలు కూర్చోడానికి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పించారు. మొత్తంగా కార్యాలయ వాతావరణాన్నే మార్చేశారు.

నేడు కరకచెట్టు పోలమాంబ వార్షిక పరస



పోలమాంబ ఆలయం(ఇన్‌సెట్) పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస బుధవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టు పక్కల 14 గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకోనున్నారు. పెదవాల్తేరు, గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములవారి పట్టాభిషేకం, భజన చెట్టు, కోలాటం, తప్పెటగుళ్ళు ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ఈవో డి.వి.ఎస్ సురేష్ బాబా తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ధర్మ దర్శనంతో పాటు రూ.100 టికెట్‌తో అంతరాలయ దర్శనం, పూజ చేయనున్నారు. రూ.516 టికెట్ తీసుకున్న భక్తులకు గోత్ర నామాలతో ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకం, ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయం వద్ద పెద వాల్తేరుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ మార్గం కోలాహలంగా మారనుంది.

'ఉక్కు' సెగ ఢిల్లీని తాకేలా..

- 30న ప్రజా గర్జన
- ఉక్కు పోరాట కమిటీ నాయకులు వెల్లడి
- 705వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీకి సెగ తాకేలా ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జన నిర్వహించనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపా రు. కార్మికుల ఐక్య ఉద్యమాలతో కేంద్రప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 705వ రోజు మంగళవారం సంస్థలోని డబ్ల్యూ.ఆర్.ఎం–1 మరియు 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, చిత్రాడ సన్యాసిరావు, కె.శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్ తదితరులు ప్రసంగించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రప్రభుత్వం అణచివేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు చాలా ముఖ్యమని, దీనిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలందరూ నష్టపోతారని తెలిపారు. లక్షల మందికి అన్నం పెడుతున్న పరిశ్రమను అమ్మేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా, కేంద్రప్రభుత్వం కార్మికుల మనోభావాలకు విలువనిచ్చి ప్లాంట్ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మురళి, బాషా, రాజు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

డెబ్రిస్ తొలగించండి



నందగిరినగర్ రోడ్‌లో పేరుకుపోయిన డెబ్రిస్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు దాడిరామ్మూర్తి కల్యాణ మండపం వెనుక వీధి నందగిరినగర్ రోడ్‌లో డెబ్రిస్ పెద్ద కుప్పగా పడేశారు. రోడ్డు పక్కన పెద్ద ఎత్తున డెబ్రిస్ కనిపిస్తున్నా.. అధికారులెవరూ పట్టించుకోలేదు. వెంటనే డెబ్రిస్ తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– కె.సింహాచలం, నందగిరినగర్

మ్యాన్‌హోల్ లీకుతో దుర్వాసన



రాజేంద్రనగర్‌లో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ వార్డు కార్యాలయం సమీపంలో యూజీడీ మ్యాన్ హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. దీంతో రెండు వారాలుగా స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు ప్రవాహంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– జి.వెంకటరావు, రాజేంద్రనగర్

పేరుకుపోయిన చెత్త



రాజేంద్రనగర్‌లో వార్డు కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త



కనకమ్మ ఆలయం వద్ద చెత్త, వ్యర్థాలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండగ కారణంగా సిబ్బంది వరస సెలవులతో వార్డులో పలు చోట్ల చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మంగళవారం నుంచి సిబ్బంది విధులకు హాజరయ్యారు. అయినా పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. స్థానిక కనకమ్మ ఆలయం వద్ద, రెల్లి వీధి ఎదురుగా, అలాగే వార్డు కార్యాలయం సమీపంలో చెత్త పేరుకుపోయింది. ఈ చెత్త గాలికి, కుక్కలు వలన చెల్లాచెదురు అవడంతో అపారిశుధ్య వాతావరణంతో ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి వార్డులో మెరుగైన పారిశుధ్యం కోసం తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బోసిపోయిన రహదారులు



జనసంచారం లేని 80 అడుగుల రోడ్డు



అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్డు ఇలా..

సీతంపేట: నిత్యం వాహనాల రద్దీ, రణగొణ ధ్వనులతో బిజీగా ఉండే రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెలపోయాయి. సంక్రాంతి పండక్కి పట్టణ వాసులంతా సొంతూళ్లకు వెళ్లడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. సీతంపేట, అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్లు, శంకరమఠం రోడ్, రామాటాకీస్ రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. ముక్కనుమ కావడంతో నగరంలో ఉన్న కాస్త జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, చిరువ్యాపారులు దుకాణాలు తెరవక పోవడంతో రహదారుల్లో సందడి లేకుండా పోయింది.

పోలీస్ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో రావాడ శివారు బొట్టవానిపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు(44)కు కాలు విరిగిపోయింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు.. చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి అచ్యుతాపురం వెళుతున్నాడు. రావాడ శివారు బొట్టవానిపాలెం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన నావెల్ డాక్‌యార్డ్‌కు చెందిన పోలీసు వాహనం తిరుపతిరావును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతిరావు కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 19న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com